

# మాండవ్యం

"ఆకాశం నిండా నల్లమొబ్బు మోదాలు కమ్ముకుంటాండయి. మోదం మోదం రాసుకొని ఉరుముకుంటాంది. ఉరుమూ ఉరుమూ రగులుకొని మెరుపులవుతాండయి. మెరుపూ మెరుపూ పెనేసుకొని అగ్గి కురుస్తాంది. ఆ సెగకు కర్రి మోదం కదిలిపోతాంది. కొట్టుకొని పోతాంది. ధూం తగిలిచ్చుకొని దెంకొని పోతాది. ధీనెక్క కర్రిమోదం ఈ గడ్డమీద కురసాలంటే ఈ మోదాలకు ఎంత సొయ్యమో... మా నెత్తిన కరువును పోసి యాడాస్నో వానల్ని వొలకబోస్తాయి. ఈ మోదాలకున్నంత నీల్గుడు..." తిట్టుకుంటాండడు మాండవి తల్లి దేవళం వసారాలో పండుకొని ఆకాశం దిక్కు జూస్తూ తిక్క శివుడు.


నల్లని శరీరం, మాసినగడ్డం, చినిగిపోయిన గుడ్డలు, చేతిలో పంగల కట్టె, భుజానికి జోలె, కాలుకు చీముకారే కురుపు, మూగే ఈగలు ఇదీ తిక్క శివుడి ఆకారం. ఎప్పుడూ మాండవి తల్లి దేవళం కాడ్నే వుంటాడు. ఆకలైనప్పుడు మాత్రమే లేసి పల్లెలోకొచ్చి ఎవరో ఒకరింట్లో యింత సంగటి జోలెలో పెట్టించుకొని, మళ్ళీబోయి ఆ దేవళం కాడ్నే కూర్చొని తిని, కోనేరులోని నీళ్ళు ముంతతో ముంచుకుని తాగుతాడు. ఇట్నే జీవితమంతా గడిసిపోతాంది.

## వేంపల్లి గంగాధర్

ఆకాశమంటే కోపం. మోడాలంటే కోపం. పంటలంటే కోపం. వ్యవసాయమంటే కోపం. నమ్ముకున్న దైవమంటే కోపం. అందుకే మాండవి తల్లి పసుపు కుంకాల విగ్రహానికి మసిగుడ్డ కప్పినాడు. ఆ గుడి కాడ ఆ తల్లికి పూజలు లేవు. పునస్కారాలు లేవు. దేవళం సగం కూలింది. గబ్బిలాలు చేరినాయి. పీతికంపు కొడతాంది. ఆ దేవళంలోనే వుంటాడు తిక్కశివుడు... ఆ తల్లిని గబ్బు కూతలు తిట్టుకుంటూ.

**కథ**

తిక్క శివుడంటే మా పల్లెలో అందరికి అభిమానం. పెద్ద పెద్దోళ్ళు కూడా చేతులెత్తి మొక్కుతారు. ఆత్మీయంగా ఆదరిస్తారు. ఆయనొచ్చి అడగాల్నే గానీ ఆస్తుల్నెయినా అప్పగిస్తారు. ఆయనకున్న పేరు అట్లాటిది. తిక్క శివుడనే పేరు కూడా అమాయకంగా పిల్లోళ్ళు మాట్లాడుకునేది. 'వీరశివుడు' అని నోరారా పిల్చుకోవడమంటే అందరికి పరమాన్నం తిన్నంత ఇష్టం. అప్పుడు...అప్పుడెప్పుడో నా చిన్నప్పటి రోజుల్లో వీరశివుడి సాహసాల గురించి కతలు కతలుగా సెప్పుకునేటోళ్ళు. ఆ కతలన్నీ జ్ఞాపకమొస్తాండయి.



** ** **

దినం రేత్తిరి పూట ఊర్లోకి పులి వస్తాందని పల్లె జనం భయపడతాంటే ఆ విషయం విన్న వీరశివుడు ఒ రోజు మాటికి తన సావాసగాళ్ళను వెంటేసుకొని కవ్వంకోనకు బయలుదేరాడు. నల్లమల అడవుల్లోంచి నాగులకోన దాటుకొని కవ్వంకోన దిక్కుకి యల్లబారినాడు. పెద్దపులి వేటకని జెప్పితె ఎవరూ వెనకెమ్మిడితి రారని అడవి కుందేళ్ళ కోసమని నమ్మించినాడు. నడి రాత్రికంతా నాగులకోనకు చేరుకొని అన్నుంచి అడ్డదారి గుండా కవ్వంకోన చేరారు. సేతిలోని నాటు తుపాకి ఆకలి చూపులు చూస్తోంది. బండరాయి పైకెక్కి కిందకి చూస్తాండడు వీర శివుడు. సిన్నగా అలికిడైంది గుబురు సెట్లలో. సవాసగాళ్ళు బెదిరి గుట్టపైకెక్కినారు. వీరశివుడు తుపాకీ సరిజేసుకున్నాడు. గురి కుదిరింది. చూపుల్లో ఏదో అనుమానం తగిలింది. ఆగినాడు. లాంతరు బుడ్డి రొంత పైకెత్తి పట్టుకోమన్నాడు. పరీక్షగా సెట్లలోకి జూసినాడు. గుట్ట దిగడం మొదలుపెట్టినాడు. అందరూ వద్దు అనిరి. అయినా వినకుండా అడుగుల శబ్దం కాకుండా సెట్ల దిక్కు బోయి రొంత ఒంకొని రెండు చేతుల్లో లగుసుకున్నాడు. దొరికింది...దుప్పిపిల్ల. మొత్తుకుంటాంది. అట్టా యిట్టా యిడిపించుకోవాలని పెనుగులాడినాక చేతిలోని నులక తాడుతో రెండు కాళ్ళు కట్టి పారేశాడు అడ్నే. అది అరుస్తానే వుంది. అన్నుంచి గబగబ గుట్టపైకెక్కాడు. నాటు తుపాకీ చేతిలోకి తీసుకున్నాడు. దుప్పిపిల్ల దిక్కు గురి చూపెట్టుకొని పొంచుకొని కూర్చున్నాడు. ఆ దుప్పి పిల్ల మొత్తుకుంటానే వుంది... అడవంతా అదిరిపడేటట్లు.

లాంతరు బుడ్డి వెలుగు తగ్గించినాడు. తోడు వచ్చిన సవాసగాళ్ళు బెదిరి ముడుక్కుని ఏం జరుగుతాదోనని చూస్తాండరు. తుపాకీ గురి దుప్పి దిక్కే వుంది. దుప్పి అరుపు ఎక్కువైంది. ఒక్కసారిగా చావు అరుపు అరిసింది. వీర శివుడి చేతిలోని తుపాకీ పేలింది. తూటా దూసుకపోయింది. పులి ఎగిరిపడింది. పులి...పులి... దుప్పికోసం వచ్చింది. వీరశివుడి గురి గెల్చింది. ఈ సందిట్లో నులక తెంచుకున్న దుప్పి అదే పోటన ఎగిరి పొదల్లోకి ఉరికెత్తింది. గుట్ట నాలుగడుగులు దిగి మళ్ళీ నాటు తుపాకీ సరిజేసుకొని కిందపడి గిలగిలా కొట్టుకుంటాండే పులిని గురిజూసి కొట్టినాడు. అది గాండ్రించుకుంటా తనకలాడతా సచ్చింది. ఇదంతా ముడుక్కుని చూసే సవాసగాళ్ళు అడ్నే ఉచ్చులు పోసుకున్నారు. ఇదీ వీరశివుడి వేట గురి కత.

పులిని కొట్టినాడని ఊర్లో తెల్సినాక ఎద్దుల బండిమీద సచ్చిన పులిని, వీర శివుడ్ని కూర్చోబెట్టి ఊరేగించినారు ఊరిజనం. సుట్టుపక్క అరవైఆరు పల్లెలోళ్ళు వచ్చి పండగతిన్నా వేడుక చేసినారు. ఆ పులి చర్మం తీసి వీరశివుడి ఇంట్లో గోడకు యాలగట్టినారు దర్పంగా. పులిగోరు తీసి బంగారు గొలుసుకేసుకున్నాడు.

** ** **

వీర శివుడికి పెండ్లి నిశ్చయమైంది. ఒలి కింద మామకు రాయారం వంక కాడుండే గోగు సేను యిచ్చినాడు. పెండ్లిరోజు పెండ్లి కూతురు పార్వతికి మూడుకొంగుల చీరె, పూసల రవికె, బిళ్ళగాజులు, కర్ణపువ్వులు, ఏడు వారాల నగలు అన్నీ వీరశివుడే లాంచనమిచ్చినాడు.

"కరువుకాల మొస్తాంటే కళ్యాణమేమిటిదో" అనిరి సరిపోనోళ్ళు.

"మా వూరి రెడ్డి పెండ్లి ఘనంగానే చేసుకుంటాం" అని ఆకాశమంత పందిరేసి, ఊరంతా ముగ్గులేసి ఉత్సవం తిన్నా పన్నెండు రోజుల పెండ్లి చేసిరి. సుట్టుపక్క పల్లెలన్నీ చిందేసి ఆడినాయి.

పెండ్లి కూతురు పార్వతి ఎంత అదృష్టవంతురాలో అనుకుండిరి ఊరంతా. అదేందో గానీ ఆయమ్మ ఊర్లోకి అడుగు పెట్టంగానే కరువు కమ్ముకునింది. అరిష్టం కొట్టింది ఊరికి. బావులన్నీ ఎండి పోయినాయి. సెరువులన్నీ యింకిపోయినాయి. ఊరం తా నమ్ముకొని వుండే మాండవి నది తల్లి ఎండి పోను మొదలుపెట్టింది. జాతర రోజు బోనాలు పెట్టినారు మాండవి తల్లికి. జీవాల రక్తం కూడు ఎదజల్లినారు. బండ్లు కట్టినారు. యాపాకు తోరణాలు కట్టించినారు. వెండి ముక్కెర, కళ్ళు, కోరలు చేసి పెట్టినారు. జాతర జోరుగా జరుగుతాండంగానే మాది గోళ్ళ లచ్చిమికి ఆ మాండవీ తల్లి పూనింది...

"భూమి ఆకాశం బుట్టినప్పుడూ
మహాశక్తి లోక మాత
ఆదిశక్తి లోక మాత
కాలమా శక్తి ఎట్లు బుట్టె
ఒక పక్షి రీతిగా బుట్టె
దానికి కూర్చుందామన్న తావు లేకపాయె
కలకల ఆ శక్తి అంత్రాన ఆడుతున్నదీ...

మహా బలిదానం కోరుతున్నదీ... అని జెప్పి దేవళం చుట్టి కారం మన్ను ఎదజల్లుతా తిరిగింది. జాతర పూర్తయ్యింది. గానీ ఆ తల్లి శాంతించలేదని తేలిపోయింది.

పచ్చని చెట్లు మలమల మాడిపోయినాయి. యాడ గూడా చుక్క నీళ్ళు లేని పరిస్థితి. కరువు... కరువు... కారణం ఆయమ్మ పార్వతే... 'యాడనుంచో యాడికి కోడలుగా వచ్చింది. ఈ పాపం ఆయమ్మ దెట్టా యితాది... అని కొందరంటే, ఆదేంగాదు ఆయమ్మ అరిష్టం ఊరికి శాప మైందని అనడం మొదలుపెట్టినారు. ఆయమ్మ ఈ సూటిపోటి మాటలు భరించలేకపోయింది. తనలో తాను కుమిలి కుమిలి ఏడ్సుకుంది. తన అరిష్టం కారణంగానే ఊరు వల్లకాడు తిన్నా అయితాందని అనుకుంది.

వీరశివుడు సముదాయించినా వినలేదు.

మొగుడు చేనుకాడికి పోయినాక మిట్ట మధ్యాహ్నమప్పుడు గన్నేరు కాయలు నూరుకొని పసురు చేసుకొనింది. మనసులోనే ఆ మాండవీ తల్లికి దండాలు జేసుకొనింది. "ప్రజల కష్టాలు పోవాల... పాపాలు పోవాల... కన్నీళ్ళు పోవాల... నీళ్ళు...నీళ్ళు... కురసాల... కురిసి, కురిసి నేలంతా తడసాల...చెరువులు నిండాల...పంటలు పండాల... కరువు పోవాల... మాండవి నదీ పారాల... తల్లీ నా ఆత్మబలిందానం తీస్కో... తీస్కో తల్లీ... పసురు ముంత ఎత్తుకొని నట్టింట్లో గడప మానుపై కూకొని గడగడ తాగింది ఆయమ్మ పార్వతి తాగిన రొంత సేపుకు ఊపిరి పోయింది. కాళ్ళూ, సేతులు బిగసకపోయినాయి.

మాటికి వీర శివుడు వచ్చి చూసేసరికి ఆయమ్మ శరీరం నల్లగ మాడి పోయినట్లయింది. యింగ ఎవరేం చేస్తారు? వీరశివుడి దుఖ్ఖం చెప్పన లవి కాలేదు. పడిపడి ఏడ్సినాడు. బంగారుమట్ట బిడ్డ పెండ్లి అయ్యి ఆరు మాసాలైనా కాకముందే ఊరికోసం ప్రాణం మిచ్చిందని జనమం దరూ అనుకునిరి.

ఆయమ్మను మాండవీ నది ఏట్లోనే బూడ్సినారు. యింగ ఆరోజు న్నుంచే వీరశివుడు ఇంటికి పోకుండా తోటకాడ్నే వుంటాడడు. ఇంటికా డికి పోతే పార్వతే గుర్తుకొస్తాదని పోవడం మానేసినాడు. మళ్ళీ పెండ్లి జేసుకోమని ఎంతమంది జెప్పినా వినలేదు...

నీళ్ళ పరిస్థితి ఇంగా అధ్వాన్నమైయ్యింది. యాడాడుండే గుంతల్లోని గబ్బు నీళ్ళు కూడా దేవుకొని తెచ్చుకుంటాండరు.

** ** **

రోజులు గడుస్తాండయి. పీర్ల పండగొచ్చింది. ఊర్లో సంబరాలు ఏమీ లేవు. యింగ వీర శివుడే ముందుకొచ్చి సావిడికాడ సమావేశం పెట్టి నాడు. మనకు వుండే కాడికి పండగ జేయాలని చెప్పినాడు. వానలు పడాలని, కరువు పోవాలని దేవుడ్ని కోరుకుంటా గుండం తవ్వమన్నా డు. ఊరి పెద్దలందరూ అట్నే లేమని ఒప్పుకుండిరి.

రాత్రికంతా గుండం తయారైంది. నరక్కచ్చిన తాటిమాన్లు రగులుకు న్నాయి. ఎర్రని నిప్పులైనాయి. సెగను ఎగజిమ్ముతాండయి. గుండమైతే తయారైంది గానీ నడిసేటోళ్ళు ఎవరుండారు? ఎప్పుడూ నడిసే పీరన్న మామ మంచాన పడినాడు. కొడుకు జమాలు కుమ్మరోళ్ళ పాప కాంతమ్మను లేపుకొని ఊరు విడిసిపోయినాడు.

వలసలు మొదలైనాయి. నీళ్ళు లేని ఊర్లో వుండేకంటే వల్లకాడి కాడైనా వుండడం మేలని ఊరి జనం ఎవరి దావ కొద్ది వాళ్ళు పోతాండరు. ఇంత కాలం నమ్ముకున్న నేలను విడిసిపెట్టి దేశాలు పట్టుకొని పోతాండే వాళ్ళని జూస్తే వీరశివుడికి బాధైంది.

గుండం రగులు కుంటానే వుంది. యింగ వీరశివు డే ముందుకొచ్చినాడు. సేతిలోకి పెద్ద పీరును తీసుకొని గుండంలోకి అడుగులేసినాడు. అడుగు లు పడేకొద్ది నిప్పులు ఎగిరెగిరి పడతాండయి. అలివిగాని జనం... తోసుకుంటూ...దొబ్బుకుం టా...చూడడానికి ఎగబడతాండరు.

అన్నుంచి ఈ పక్కకు, ఈన్నుంచి ఆ పక్కకు మూడుసార్లు నిప్పుల్లో నడిసినాక పీరును సావిడిలో పెట్టి కళ్ళు తిరిగి పడిపోయినాడు వీర శివుడు.

"అలవాటు లేని పని ఏంటికి జేస్తివి సామీ... అన్నాడు పక్కనుండే పెద్దాయన.

"ఈ కరువు చూడలేకనే పెద్దాయన..." చెప్పినాడు వీరశివుడు బిగు సుకపోయిన పాదాలను సూసుకుంటూ.

అయినా ఆకాశం మెరిసింది లేదు. కురిసింది లేదు. సినుకుల ఉచ్చ లు పోసింది లేదు. మొండి మోడాలు కనికరించలేదు.

గుండం చల్లారినాక ఆ బూడిదను వీబూది వాడుకోడానికి జనం పోటీబడినారు. ఆ బూడిదుంటే ఇంట్లో పిశాచాలు, దెయ్యాలు జేరవని వాళ్ళ నమ్మకం. మిగిలిన బూడిద ఆకాశానికేసి ఎదజల్లినారు. వానలు కుర్సాలని ప్రార్థించినారు. అయినా ఆకాశం రవ్వంతైనా కరగలేదు.

** ** **

వలసలు మొదలైనాయి. నీళ్ళు లేని ఊర్లో వుండేకంటే వల్లకాడి కాడై నా వుండడం మేలని ఊరి జనం ఎవరి దావ కొద్ది వాళ్ళు పోతాండరు. ఇంత కాలం నమ్ముకున్న నేలను విడిసిపెట్టి దేశాలు పట్టుకొని పోతాండే వాళ్ళని జూస్తే వీరశివుడికి బాధైంది.

అయినా ఏం జేస్తాడు? కరుణ రసాన్ని చిందించే భక్త సిరియాలుని కథ జెప్పిస్తే ఆ మోడాలు కరిగి కరుణిస్తాయని ఎవరో పెద్దాయన చెబితే అట్నే లేమని రంగ సముద్రం కాడ్నుంచి కళాకారుల్ని పిలిపించినారు. రాత్రిపూట మాండవీ తల్లి దేవళం కాడ కత సెప్పడం మొదలైంది.

"చుట్టూర కూరల్లు నడుమనన్నాము
భోం చేతురురండయ్య శివ భక్తులారా
నరమాంసము లేంది భోంచేయమనిరి
ఆడేటి బాలుణ్ణి అటు బిలిచినారూ

పాలు బోసి ఒక కత్తి పాకంగనూరి
నెయి బోసి ఒక కత్తి నేటంగ నూరి



వచ్చేటి బాలుణ్ణి వడిసి నరికినారు

"ఓ యమ్మో తల్లీ...పిల్లోన్ని ఊరికే సంపిరి కొడుకా..." జనంలో కలకలం పుట్టింది. ఆడోళ్ళు ఏడుస్తాండరు. పల్లె జనం మొత్తుకుంటాండరు. బంగారమంటి బాలుణ్ణి చంపను సేతులెట్టొచ్చినాయని ఆడిపోసుకుంటాండరు ఆడోళ్ళు. యాడ జూసినా జనం ఏటి గట్టు పైకెక్కి గూడా కత వింటాండరు.

రంగ సముద్రం కళాకారులు కతను కళ్ళకు కట్టినట్లు జెప్తాండరు. కత సాగుతానే వుంది.



"వచ్చిన బాలుణ్ణి వడిసి నరికినాక
చిన్న చిన్న ఎంకలు చిన్నటిక కేసి
పెద్ద పెద్ద ఎంకలు పెద్దటిక కేసి
నెయి బోసి ఒక కుండ నేటంగ వండె
పాలు బోసి ఒక కుండ పాకంగ వండె

చుట్టూర కూరలు నడుమనన్నాము
భోం చేతురురండయ్య శివ భక్తులారా...

కత నడుస్తానే వుంది. కురసాల్సిన మోడాలు కొట్టుకొని బోతాండడం జూసి వీరశివుడికి వాయి కొట్టింది. కాళ్ళు, సేతులు బిగసక బోయినాయి. నాటు వైద్యుడొచ్చి పసురుబోసి కూర్చోబెట్టినాడు. కత వినవొచ్చిన జనమంతా గుంపు చుట్టుకున్నారు. కత మధ్యలోనే ఆగిపోయింది.

ఆరోజు మొదలు వీరశివుడికి రోంత రోంత మతి తప్పడం ప్రారంభమైంది. తిక్కతిక్కగా మాట్లాడ్డం... వెకిలిగా నవ్వడం... ఏడ్వడం... దుమ్ము ఆకాశానికేసి ఎదజల్లడం... ఈ ప్రవర్తన చూసేటోళ్ళకు మనస్సంతా బాధను కల్గించేది.

బంగారం లాంటి మేడ కూలిపోయాక, భూములన్నీ బీళ్ళు బడినాక, వీరశివుడ్ని చూసుకునేటోళ్ళు ఎవరూ లేకపోయిరి. కాలంతోపాటే వయసూ కరిగిపోతాంది. ప్రాయం అరిగిపోతాంది.

మనిషైతె తగ్గలేదు గానీ సేతిలో పంగల కట్టె పట్టుకొని అప్పుడప్పుడు ఊర్లోకొచ్చి కన్పిస్తా వుంటాడు. అయినా ఆ మనిషి ఊరుకుంటాడా...

** ** **

తెల్లారిందగ్గర్నుంచి ఈయాల మోడాలను తిడతానే వుండాడు. ఇప్పుడు బయలుదేరినాడు. వీరాపురం వంక కాడుండే కాటికాపరి ఎల్లన్నను కలిసి అంజనం వేసి చూడమన్నాడు- మాండవి నది కతేందో. ఆయన జూసి చెప్పినాడు... "నేల అడుగు నుంచి ఆకాశ మోడాల కాడికి అరిష్టం అల్లుకొని వుండాదని, గొప్ప బలిదానం జరిగితే తప్ప ఇది పోదని." 'ఔనాను... ఆయాల పూనకమప్పుడు గూడా ఆ తల్లి అదే పలికిందని జెప్పి...'పరుగు పరుగున మాండవి తల్లి దేవళం కాడికి వచ్చినాడు. విగ్రహానికి చుట్టిన మసి గుడ్డ తీసి పారేసినాడు. పసుపు కుంకాలు జల్లి పూజలు చేసినాడు. గబ్బిలాలను ఎల్లగొట్టినాడు. మలినాన్నంతా ఎత్తి దిబ్బలోకి పారబోసినాడు. నోటికొచ్చిన మంత్రాలేవో ఆ తల్లిముందు కూకొని పాడినాడు.ఆడినాడు. పొర్ల దండాలు పెట్టినాడు. ఏడ్సినాడు. రాత్రంతా ఆ తల్లి విగ్రహం కాడ్నే కూలబడి ప్రార్థించినాడు. తెల్లారినాక ఏదో రహస్యం కనిపెట్టినట్లు ఊర్లోకి వచ్చినాడు వీరశివుడు సంబరంగా.

"ఉండదులే... ఈ కరువు దీనెక్క దని అంతు చూస్తానని" ఊరంతా తిరుగుతా చెప్పినాడు. జనమంతా ఈ తిక్కలోడి మాటల్ని ఆశ్చర్యంగా విన్నారు.

పంగల కట్టెను పక్కకు విసిరేసి మాండవి తల్లి దేవళం కాడ ఆ తల్లికి దండాలు చేసుకున్నాడు. అట్నే బయలుదేరినాడు...ఏటి గట్టుపైకి. నిర్మానుష్యంగా ఎండిపోయి బీడ పడిన భూములు, ఎర్రటి దుమ్ముతో సుళ్ళు తిరుగుతాంది యేటి ఇసుక. అట్నే ముందుకు సాగినాడు. నది యేట్లో నిలబడి చుట్టూ మాండవి తల్లిని తనివితీరా చూసుకున్నాడు. దుఃఖించినాడు. దూరంగా ఊరిజనం ఉరుకుతా ఇట్నే వస్తాండరు.

రాత్రంతా కూర్చోని పదును పెట్టిన చంద్రవంక గొడ్డలిని ముద్దు పెట్టుకున్నాడు. ఇసుకను అరచేతిలోకి తీసుకొని కళ్ళ కద్దుకున్నాడు. "మాకెందుకీ తల్లీ ఈ నరకం. అట్ట అందర్నీ చంపనన్న చంపు. లేకుంటే అందరికింత కడపన్న నింపు. నడమన ఈ కరువేంది... చేతిలోని ఇసుకను కిందకేసినాడు.

"నా ప్రాణం తీసుకొనైనా శాంతించి
నాల్గు సుక్కల కన్నీళ్ళు జారిడుసు...

అంటూ సేతిలోని చంద్రవంక గొడ్డలిని శక్తికొద్ది గిరగిరా తిప్పి ఆకాశంలోకి విసిరినాడు. అది తిరుక్కుంటా... తిరుక్కుంటా కిందకి వస్తాంది... వస్తాంది... వచ్చేటప్పుడు తలొంచినాడు వీరశివుడు. తలొంచినోడ్ని పక్కకి లాక్కొని పోయినారు ఊరిజనం.

"యిడసండి... యిడసండి..." అని విదిలించుకున్నాడు వీరశివుడు. పైకి ఎగిరిన గొడ్డలి ఆ పక్కన యాడ్నో పడి ఇసకలో కూరుకుంది.

"యేంది సామీ యిట్టా జేస్తివి" జనంలో ఎవరో అనిరి.

"సావనీండి...నన్ను సావనీండి... మీకు వానలు పడ్తాయి. మీరు సల్లంగుండురు..." దుఃఖంతో జెప్తాండడు.

"సచ్చే వానలు పడేటట్లుంటే రోజుకొకరం సచ్చిపోమా సామీ... సావే సమాధానమా... ఎట్టా చెప్తాండడు జనంలోని పెద్దాయన.

"ఆ మాండవీ తల్లికి కరుణ కల్గితే ఇప్పుడే వాన కుర్సుతాంది...మనమేంటికి ప్రాణాలు తీస్కోవాల... ఎవరో ఆడగొంతు వినపడ్తాంది.

ఔ...తానేం జేస్తున్నాడు...ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడు. లేదు...నేను జనం కోసం వీరశివుడిగానే బతకాలి. జనంకోసం బతకాలి... ఊరికోసం బతకాలి... కాలి కింద చమట తడి... తడి నెర్రెలు చీలిన నేల మీద సన్నని తడి... నీళ్ళ తడి... భూమి పగిలింది. రగిలింది... ఆకాశం బెదిరింది.

రాత్రంతా కూర్చోని పదును పెట్టిన చంద్రవంక గొడ్డలిని ముద్దు పెట్టుకున్నాడు. ఇసుకను అరచేతిలోకి తీసుకొని కళ్ళ కద్దుకున్నాడు. "మాకెందుకీ తల్లీ ఈ నరకం. అట్ట అందర్నీ చంపనన్న చంపు. లేకుంటే అందరికింత కడపన్న నింపు. నడమన ఈ కరువేంది... చేతిలోని ఇసుకను కిందకేసినాడు.

కమ్ముకున్న నల్లమొబ్బు మోడాలు ఒకదానికొకటి రాసుకొని ఉరుముకుంది. ఉరుమూ ఉరుమూ రగులుకొని మెరుపులైనాయి. మెరుపూ మెరుపూ పెనవేసుకొని అగ్గి కురిసింది. ఆ సెగకు కర్రి మోడం కదిలింది. కిందకి యాడుండే మోడం అడ్నే. ఎట్టుండే మోడం అట్నే. గుండెను తెరిచి కన్నీళ్ళు కార్చడం మొదలుపెట్టింది సినుకుల్లా.

ఒక సినుకు తర్వాత... ఇంకోటి పైనుంచి నేల నెర్రల్లోకి దిగుతాండయి. వాన... వాన... కురుస్తానే వుంది... రోజుల తరబడి... వాగులు పొంగినాయి...

వంకలు ఉప్పొంగినాయి... నీళ్ళు...నీళ్ళు...నీళ్ళు...
యాడజూసినా నీళ్ళు... కరువు కొట్టుకపోతాంది...
తల్లి మహాతల్లి...మాండవి తల్లి పారతాంది.
ఏరులై పారతాంది...వరదై పారతాంది...
పచ్చగా నవ్వుకుంటా పాడతాంది...
ఉడికిన వేళ్ళకు ఊపిరి వచ్చింది...
పాసిన వేళ్ళకు ప్రాణం వచ్చింది...వచ్చింది...వచ్చింది...
ఊరికి ప్రాణమొచ్చింది. ఊరు పచ్చని చెట్టైంది...
పక్షుల కొలువైంది... పంటల నెలవైంది.. పాటల దరువైంది...
జాతర చిందైంది...
మాండవి వెండి ముక్కైరెంది.